
# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
16-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 29

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# తెలంగాణలో టిడిపిని పక్కన పెట్టినట్టే!






2లో

తెలంగాణలో తెలుగుదేశం పార్టీని చంద్రబాబు విడిచిపెట్టినట్టేనా? అక్కడ పార్టీని పునరుద్ధరించే అవకాశం లేదా? లేకుంటే ఆసక్తి లేదా? పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. తెలుగుదేశం పార్టీ కార్యవర్గాలను సమూలంగా మార్చుతూ.. కొత్త కమిటీలను ప్రకటించారు చంద్రబాబు. నారా లోకేష్ ను జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. 26 మందితో పార్టీ పొలిట్ బ్యూరోను ఏర్పాటు చేశారు.

## ఏపీతో పాటు జాతీయ కార్యవర్గం ప్రకటన

## తెలంగాణకు దక్కని చోటు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** జాతీయస్థాయిలో ఎంతోమందికి పదవులు ప్రకటించారు. ఏపీకి సంబంధించి అనుబంధ విభాగాలను సైతం భర్తీ చేశారు. కానీ తెలంగాణ ఊసు లేకపోవడం గమనార్హం.

**గతంలో వేరువేరుగా కార్యవర్గాలు..**

రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం పార్టీని జాతీయ పార్టీగా ప్రకటించారు



# లోకేష్‌కు పట్టాభిషేకం!

టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పదోన్నతి

ఇంతింతై అన్నట్టు ఎదుగుతున్న యువనేత


ప్రతికూల ప్రచారాలను, అవమానాలను ఎదుర్కొంటూ విజయాల వైపు ప్రయాణం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:**

నారా లోకేష్ అను నేను.. అనే మాట ఎంత దూరంలో లేదు అని అనిపిస్తోంది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ కీలక నేతగా, ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న నారా లోకేష్ కు

# భారత రాష్ట్ర సమితి క్లోజ్!

జాతీయ రాజకీయాలు అంటూ హడావిడి చేశారు కేసీఆర్. 2023 ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రధాని కావాలని భావించారు కేసీఆర్. అందుకే తన పార్టీని జాతీయ పార్టీగా విస్తరించి అడుగులు వేశారు. ఏపీతో పాటు ఒడిస్సా, మహారాష్ట్ర, కర్ణాటకలో చాలామంది నేతలను భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. కానీ 2023 ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ ఓడిపోయింది.



ఆ పార్టీకి ఒక్కోనేత గుడ్ బై

పవన్ కళ్యాణ్ తో సమావేశమైన ఏపీ బిఆర్ఎస్ అధ్యక్షుడు

త్వరలో జనసేనలోకి తోట చంద్రశేఖర్



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** స్వరాష్ట్రంలోనే ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంది ఆ పార్టీ. దీంతో ఇతర రాష్ట్రాల్లో బిఆర్ఎస్ దుకాణం బంద్ అయింది. కనీసం కెసిఆర్ పార్టీని పట్టించుకోకపోవడంతో నేతలంతా ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. తాజాగా బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట

- మిగతా 2వ పేజీలో

## ఇక నామినేటెడ్ సందడి!





పదవుల భర్తీపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి

సీఎం రేవంత్ తో మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్

త్వరలో అధికారిక ఉత్తర్వులు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుందా? వీలైనంత త్వరగా పదవుల పంపకాలు పూర్తి చేయాలని భావిస్తోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. బుధవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డితో పార్టీ కీలక నేతలు మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. నామినేటెడ్ పోస్టుల ఎంపికపైనే ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఆశావహుల్లో

- మిగతా 3వ పేజీలో

## నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ

ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం

వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా

2లో

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం

- కులగణన లేకుండా బిల్లు అమలు కుదరదు
- బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమే
- విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ,ఏప్రిల్15(ఆర్ఎన్ఎ): మహిళా రిజర్వేషన్లపై కేంద్రం తీరును రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న సవరణ కేవలం అధికారం కోసమేనని అన్నారు.

- మిగతా 2వ పేజీలో



## మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం

మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మం

రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం

లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు



## రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే

డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం

మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు

రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం

- మిగతా 2వ పేజీలో



## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం

ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు




# బంగ్లా పౌరుల పడవ మునక

## 250 మంది గల్లంతు..ముమ్మర గాలింపు

**ఢాకా, (క్రైమ్ మిర్రర్):** అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు.

# భారత రాష్ట్ర సమితి క్లోజ్!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రశేఖర్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో సమావేశం అయ్యారు. దీంతో ఆయన జనసేనలో చేరుతారని ప్రచారం మొదలైంది.

**ఆ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా..**

తెలంగాణలో కాంగ్రెస్ తో పాటు బిజెపికి సమ దూరం పాటిస్తూ వచ్చారు కెసిఆర్. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో మూడోసారి అధికారంలోకి రావాలని భావించారు. అంతటితో ఆగకుండా జాతీయస్థాయిలో తమ పార్టీని విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అలా తన తెలంగాణ రాష్ట్ర సమితి భారత రాష్ట్ర సమితిగా మార్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడమే కాదు.. జాతీయస్థాయిలో కాంగ్రెస్, బిజెపిలకు ప్రత్యామ్నాయంగా మారాలని చూశారు. ఎన్డీఏ తో పాటు ఇండియా కూటమికి దూరంగా ఉండాలని భావించారు. ముందుగా దక్షిణాది రాష్ట్రాల్లో మన పార్టీలు విస్తరించి జాతీయ పార్టీగా అడుగులు వేయాలని చూసారు. కానీ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది ఆ పార్టీ. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అయితే దారుణ ఫలితాలను చవిచూసింది. దీంతో భారత రాష్ట్ర సమితి కనుమరుగు అయినట్టు అయింది.

**ఏపీ బాధ్యతలు అప్పగింత..**

అప్పట్లో జనసేనలో క్రియాశీలకంగా వ్యవహరించిన పదవీ విరమణ చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్ను తన పార్టీలోకి ఆకర్షించారు. ఆయనకు ఏపీలో బిఆర్ఎస్ బాధ్యతలు కట్టబెట్టారు. కాపులను టార్గెట్ చేసుకున్నారు. అప్పట్లో జగన్మోహన్ రెడ్డికి సాయం చేసేందుకు.. తన బిఆర్ఎస్ ద్వారా చెక్ చెప్పాలని భావించారు. ఒక్క ఏపీలోనే కాదు ఒడిస్సాలో మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గోమాంగోను పార్టీలో చేర్చుకొని అక్కడి బాధ్యతలను అప్పగించారు. కర్ణాటకలో సైతం కొంతమంది నేతలను ఆకర్షించగలిగారు. వారికి సైతం బాధ్యతలు అప్పగించారు.. కానీ భారత రాష్ట్ర సమితి కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఆ నేతలు ప్రత్యామ్నాయ రాజకీయ అవకాశాల వైపు వెళ్లిపోయారు.

**పవన్ కళ్యాణ్ తో భేటీ..**

తాజాగా ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. దాదాపు గంట పాటు వారి మధ్య భేటీ జరిగింది. త్వరలో చంద్రశేఖర్ జనసేనలో చేరుతారని ప్రచారం నడుస్తోంది. ప్రజారాజ్యం పార్టీ సమయంలో చాలా యాక్టివ్ గా పని చేశారు చంద్రశేఖర్. అటు తరువాత వైసిపిలో చేరి ఏలూరు ఎంపీ స్థానానికి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత జనసేనలో చేరి 2019 ఎన్నికల్లో గుంటూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో మరోసారి పోటీకి సిద్ధపడుతుండగా కెసిఆర్ పిలుపుతో ఆ పార్టీలో చేరారు. కానీ భారత రాష్ట్ర సమితి ఆశలు నిలవలేదు. కెసిఆర్ ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. దీంతో ఆ పార్టీని నమ్ముకున్న నేతలు ఒక్కొక్కరు ప్రత్యామ్నాయ రాజకీయ అవకాశాలు వెతుక్కుంటూ వెళ్తున్నారు.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి.

## కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

**వాషింగ్టన్,, (క్రైమ్ మిర్రర్):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై అభ్యంతరం

మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతు ఇస్తుందని తేల్చి చెప్పారు. గురువారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కులగణన లేకుండా మహిళా రిజర్వేషన్ల అమలులో పారదర్శకత ఉండదని అభిప్రాయపడ్డారు. చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కుట్ర జరుగుతోందన్నారు. కుల గణన డేటాను విస్మరించడం అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటాను దొంగిలించడమేనని అన్నారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లుతో మహిళా రిజర్వేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఏప్రిల్ 16న పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఓ వీడియో విడుదల చేశారు. డీలిమిటేషన్‌తో కేంద్ర ప్రభుత్వం గెర్రీమాండరింగ్‌కు పాల్పడే ప్రయత్నం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పునర్వ్యవస్థీకరించుకునే కుట్ర చేస్తోందన్నారు. గెర్రీమాండరింగ్‌తో మళ్లీ అధికారం పొందేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు.కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ మాట్లాడుతూ.. 'మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మహిళా రిజర్వేషన్లను 2023లోనే అమలు చేయమని కోరాం. మా విజ్ఞప్తిని ఏమాత్రం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు.

# తెలంగాణలో టిడిపిని పక్కన పెట్టినట్టే!

చంద్రబాబు. తాను జాతీయ అధ్యక్షుడిగా ఉంటూనే.. రెండు తెలుగు రాష్ట్రాలకు వేరువేరుగా కార్యవర్గాలను ప్రకటిస్తూ వచ్చారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తెలంగాణలో గౌరవప్రదమైన సీట్లను సొంతం చేసుకుంది. కానీ కొద్ది రోజులకే కేసీఆర్ గురిపెట్టడంతో తెలుగుదేశం పార్టీకి భారీ దెబ్బ తగిలింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జత కలిసింది తెలుగుదేశం. దీంతో అక్కడి ప్రజలు తిరస్కరించారు. అయితే ఆ ఎన్నికల్లో ఓటమి తర్వాత తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రమణ గులాబీ పార్టీలో చేరిపోయారు. అటు తరువాత తెలుగుదేశం పార్టీకి అధ్యక్షుడు అంటూ ఎవరూ లేకుండా పోయారు.

**కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా తర్వాత..**

2018 ఎన్నికల్లో తెలంగాణలో ఓడిపోవడం.. తరువాత ఏపీలో తెలుగుదేశం పార్టీకి ఘోర ఓటమి ఎదురు కావడంతో ఆ పార్టీ.. తెలంగాణలో పూర్తిగా తుడుచుపెట్టుకు పోయింది. ఈ తరుణంలో 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కు ముందు బీసీ నేత, ఒకప్పటి టిడిపి నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనకు పగ్గాలు అప్పగించారు చంద్రబాబు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో జ్ఞానేశ్వర్ చురుగ్గా పావులు కదిపారు. అయితే ఇంతలోనే ఏపీలో చంద్రబాబు అరెస్టు అయ్యారు. ఆ సమయంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తే బాగుండదన్న అభిప్రాయానికి చంద్రబాబు వచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాసాని జ్ఞానేశ్వర్ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. అప్పటినుంచి తెలంగాణ టిడిపి అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది.

**మంచి క్యాడర్ ఉన్నా..**

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పునరుద్ధరిస్తారని అంతా భావించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి నాయకత్వం లేదు. కానీ క్యాడర్ తో పాటు పార్టీకి అభిమానించే శ్రేణులు ఉన్నాయి. ప్రధానంగా గ్రేటర్ పరిధిలో సెటిలర్స్ ఉన్న ప్రాంతాలతో పాటు ఖమ్మం, నల్గొండ వంటి ప్రాంతాల్లో ఇప్పటికీ ఆ పార్టీకి అభిమానులు ఉన్నారు. అయితే పార్టీ తెలంగాణ కమిటీని ఏర్పాటు చేస్తారని అంతా భావించారు. కానీ ఈరోజు ఏపీతోపాటు జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు చంద్రబాబు. అందులో తెలంగాణకు చోటు కల్పించకపోవడంతో ఇక టిడిపి అభివృద్ధి అనేది జరగని పని అని తేలిపోయింది. అయితే కొంతమంది తెలంగాణ నేతలకు పొలిట్ బ్యూరోతో పాటు జాతీయ కార్యవర్గంలో మాత్రం ఛాన్స్ ఇచ్చారు. మరి తెలంగాణ విషయంలో చంద్రబాబు ఆలోచన ఏంటో చూడాలి.

# రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

**న్యూఢిల్లీ,, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్



పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

**హైదరాబాద్,, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

# ఇక నామినేటెడ్ సందడి!

(మొదటి పేజీ తరువాయి)

సందడి ప్రారంభం అయ్యింది. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నట్లు తెలుస్తోంది.

**జాప్యాన్ని నియంత్రించేందుకు..**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపట్టారు. తరువాతే ఎందుకో ఆ విషయంలో జాప్యం జరుగుతూ వస్తోంది. మిగతా పోస్టులపై చాలామంది ఆశావహులు ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు చూస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు సమీపిస్తుంది. దీంతో మిగతా పోస్టులు భర్తీ చేయాలన్న డిమాండ్ పెరుగుతూ వచ్చింది. అయితే ఎప్పటికప్పుడు జాప్యం జరుగుతూ రావడంతో పార్టీలో అసంతృప్తి పెరుగుతోంది. పార్టీ కోసం కష్టపడి పని చేస్తే తమను పట్టించుకునే వారు లేరని చాలామంది బాహటంగానే వ్యాఖ్యానించిన పరిస్థితి ఉంది. ఈ క్రమంలో హై కమాండ్ కు ఫిర్యాదులు వెళ్లడంతో వీలైనంత త్వరగా పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర నాయకత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.



**కాంగ్రెస్ కమిటీల కూర్పు..**

ఒక్క నామినేటెడ్ పోస్టుల భర్తీ మాత్రమే కాదు... టిపిసిసి కమిటీ కూర్పు పై కూడా సీఎం రేవంత్ రెడ్డితో కీలక నేతలు చర్చించినట్లు సమాచారం. కాంగ్రెస్ కమిటీలతోపాటు నామినేటెడ్ పదవుల భర్తీ ఒకేసారి జరగాలని వారు ఒక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జిల్లాస్థాయి కమిటీల భర్తీపై కూడా తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి పోస్టుల జాబితాను అధిష్టానం సిద్ధం చేసింది. కేవలం అర్హత, కష్టపడే తత్వం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా కేవలం మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఎన్నికల వ్యూహం..**

మరో రెండేళ్లలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల వ్యూహంలో భాగంగా పదవుల పంపకాలు చేపడతారని తెలుస్తోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పార్టీ బలోపేతం పై నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో క్యాడర్ పనిచేయాలి అంటే నామినేటెడ్ పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేయాలని ఒక నిర్ణయానికి వచ్చారట. ఎన్నో సంవత్సరాలుగా పార్టీ జెండా మోసిన సామాన్య కార్యకర్తలకు కూడా ఈసారి పదవులు ఇవ్వాలని భావిస్తున్నారట. వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం ఇవ్వాలని కూడా చూస్తున్నారట. పరిస్థితులు చూస్తుంటే వేసవి లోపలే నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉందని స్పష్టం అవుతోంది.

## దాడి కేసులో ముగ్గురికి ఏడాదిన్నర జైలు

### పొలం పంచాయతీ వివాదం... కర్రలతో దాడి చేసిన నిందితులకు శిక్ష

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఏప్రిల్ 15: పొలం పంచాయతీ వివాదంలో దాడి చేసి గాయపర్చిన కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు ఏడాదిన్నర జైలు శిక్ష విధించింది. ఒక్కోరికి రూ.500 చొప్పున జరిమానా కూడా విధిస్తూ మిర్యాలగూడ రెండో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అరుణ్ తేజ బుధవారం తీర్పు వెలువరించారు.వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన కృష్ణ,పుల్లయ్య,కిరణ్ లు 2018 సెప్టెంబర్ 20న పొలం పంచాయతీ వివాదంలో ముత్యాల రవి, లక్ష్మిలపై కర్రలతో దాడి చేసి గాయపర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ డి.వెంకట్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కోర్టులో విచారణ అనంతరం ఆరోపణలు రుజువు కావడంతో నిందితులకు శిక్ష విధించినట్లు తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీపారాణి వాదించగా, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు సహకరించారు

## జావిద్ మరణం ముస్లిం సమాజానికి తీరనిలోటు.

### బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ జావిద్ సూర్యాపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం వారి పార్థివదేహాన్ని సందర్శించి దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్. జావీద్ మరణం ముస్లిం సమాజానికి తీరని లోటని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ముత్యాల వెంకట అప్పారావు, సద్దాం షేక్, మహమ్మద్ రఫీ, సయ్యద్ ఇస్మాయిల్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్‌కు పట్టాభిషేకం!



(మొదటి పేజీ తరువాయి)

ప్రమోషన్ లభించింది. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆయన నియమితులయ్యారు. చంద్రబాబు టిడిపికి జాతీయాధ్యక్షుడు కాగా.. నారా లోకేష్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్. తద్వారా తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు తర్వాత ఎవరు? అంటే కచ్చితంగా లోకేష్ అనే పేరు వినిపిస్తున్న తరుణంలో.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవితో పట్టాభిషేకం చేశారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

**పార్టీలో అంతా తానై..**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్నారు లోకేష్. చంద్రబాబు తర్వాత పార్టీ కార్యకలాపాలను చక్కదిద్దుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే చంద్రబాబు కంటే లోకేష్ ఇప్పుడు పార్టీపై పూర్తి పట్టు సాధించారు. పార్టీలో నెంబర్ 2గా కొనసాగుతున్నారు. తండ్రి తర్వాత టిడిపి పగ్గాలు చేపట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదా దక్కడంతో ఇక టిడిపి అధ్యక్షుడు, ఆపై ముఖ్యమంత్రి పదవి అన్నట్టు ఉంది పరిస్థితి. అయితే లోకేష్ రాజకీయ ప్రస్థానం అంత సాఫీగా సాగలేదు. భారత రాజకీయ చరిత్రలో ఏ రాజకీయ వారసుడికి లేనంత వ్యతిరేక ప్రచారాన్ని ఎదుర్కొన్నారు. చివరకు ప్రత్యర్థులు వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. పప్పు అంటూ ఎద్దేవా చేశారు. తెలుగులో మాట్లాడలేదంటూ విమర్శించారు. వాటన్నింటినీ తట్టుకొని లోకేష్ ఈ స్థాయికి చేరుకున్నారు.

**పుష్కరకాలం కిందట ఎంట్రీ..**

2013 లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు నారా లోకేష్. హైదరాబాద్ లోని గండిపేట లో జరిగిన మహానాడు కార్యక్రమంలో ప్రత్యక్ష రాజకీయాల్లో చేరారు. అంతకుముందు 2009 ఎన్నికల సమయంలో టిడిపి ఇచ్చిన నగదు బదిలీ హామీ ఆలోచన లోకేష్ దేనని చంద్రబాబు పలుమార్లు చెప్పారు కూడా. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చింది మొదలు నారా లోకేష్ మరింత యాక్టివ్ అయ్యారు. 2017 శాసనమండలికి ఎన్నికైన లోకేష్ మంత్రి పదవి చేపట్టారు. అయితే రాజకీయాల్లో అడుగుపెట్టిన నాటి నుంచి తెలుగు నాట ఏ నాయకుడు ఎదుర్కొనని విమర్శలు, ట్రోల్స్ కు గురయ్యారు. లోకేష్ తెలుగు ప్రసంగాల్లో తడబడే వారు. కొన్ని పదాలను ఉచ్చరణ సరిగా ఉండేది కాదు. దీంతో తెలుగు సరిగా మాట్లాడలేదంటూ హేళన చేసేవారు. వర్ధంతికి,జయంతికి తేడా తెలియదంటూ విమర్శించారు. ఒకానొక దశలో లక్ష్మీపార్వతి సైతం మాట్లాడుతూ ఒరేయ్ మనవడా మంగళగిరి అని స్పష్టంగా పలుకు.. నా మద్దతు నీకేం అంటూ సెటైరికల్ గా మాట్లాడారు. అక్కడితో వారు ఆగలేదు. జూనియర్ ఎన్టీఆర్ తో లోకేష్ కు పోలికలు తీసుకొచ్చి అవమానించారు.

**ఆ నిర్ణయమే సాహసం..**

2019 ఎన్నికల్లో మంత్రిగా ఉన్న నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. అసలు ఆ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఒకటి రెండుసార్లు మాత్రమే గెలిచింది. అటువంటి సాహస నియోజకవర్గాన్ని ఎంచుకున్న లోకేష్ మంత్రిగా ఉంటూ ఓడిపోయారు. ముఖ్యమంత్రి కుమారుడిగా చతికిల పడ్డారు. అప్పటినుంచి మరింత అవహేళనకు గురయ్యారు నారా లోకేష్. కానీ ఆయన కృంగిపోలేదు. రాజకీయాలనుంచి తప్పుకోలేదు. ప్రత్యర్థుల విమర్శలను తన ఎదుగుదల సోపానాలుగా మలుచుకున్నాడు. తనలో ఉన్న ఒక్కో లోపాన్ని సరిచేసుకుంటూ ముందుకు సాగాడు. ప్రత్యర్థుల విమర్శలకు మాటలతో కాకుండా చేతలతో సమాధానం చెప్పాడు. చివరికి తన శరీర ఆకృతిని కూడా మార్చుకున్నారు. నిత్యం ఫిట్నెస్ పై ఫోకస్ పెట్టారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు. తెలుగులో స్పష్టంగా మాట్లాడడంపై ఫోకస్ పెట్టారు. తన ప్రసంగశైలిని కూడా మార్చుకున్నారు. ఈ క్రమంలో ఆయన చేపట్టిన పాదయాత్ర ఆయనను మరో స్థాయికి తీసుకెళ్లింది. దారి పొడవునా ఎన్నో రకాల ఇబ్బందులు పెట్టింది వైసిపి ప్రభుత్వం. అయినా వాటిని తట్టుకొని ప్రజలను కలుసుకోగలిగారు. వారితో మమేకమై పని చేశారు. ఆ సమయంలోనే చంద్రబాబు అరెస్టు జరిగింది. అటువంటి సంక్లిష్ట సమయంలో కూడా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగారు లోకేష్. న్యాయ పోరాటం చేశారు. తన తండ్రిని జైలు నుంచి బయటకు తెచ్చారు.

**ప్రభుత్వంలోనూ తనదైన ముద్ర..**

2024 ఎన్నికల్లో కూటమి ఘన విజయంతో నారా లోకేష్ పరపతి అమాంతం పెరిగింది. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆయన పరిమితికి అద్దం పడుతున్నాయి. ఏపీకి పెట్టుబడులు తీసుకురావడంలో లోకేష్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ.. తెలుగుదేశం పార్టీని సమన్వయంతో నడుపుతూ ఆయన వ్యవహరిస్తున్న తీరు ఆకట్టుకుంటుంది.. మరోవైపు కేంద్ర పెద్దల అభిమానాన్ని కూడా ఇట్టే చురగొంటున్నారు లోకేష్. ఈ పరిణామాల క్రమంలో చంద్రబాబు ఒక అడుగు ముందుకు వేసి లోకేష్ కు పట్టాభిషేకం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ను చేశారు.

## జావిద్ మరణం తీరని లోటు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ జావిద్ సూర్యాపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.వారి పార్థివదేహాన్ని సందర్శించి దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జావీద్ మరణం తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నిర్లక్ష్యం వద్దు - ప్రాణం ముద్దు..రోడ్డు భద్రతపై డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు

### వేగం నీ జీవితాన్ని ఆపేయవచ్చు.. జాగ్రత్త!

### రోడ్డు భద్రతపై నల్లగొండ జిల్లా పోలీసుల వినూత్న ప్రచారం.






నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన, అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని, నల్లగొండ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా, పలు కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత చిట్యాల మండలం వెలిమినేడు వద్ద నేషనల్ హైవే-65 పై ఏర్పాటు చేసిన, ప్రత్యేక హోర్డింగ్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రమాదానికి గురైన కారును ప్రదర్శిస్తూ, "నీ వాహనం వేగంగా వెళ్తుంది.. కానీ నీ జీవితం ఆగిపోతుంది" అనే హెచ్చరిక నినాదంతో, ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. అనంతరం నకిరేకల్ పట్టణంలోని నారాయణ హై స్కూల్ విద్యార్థులతో డిజిపి ముచ్చటించి, చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను గుర్తించాలని సూచించారు. ?నకిరేకల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీటు బెల్టు వాడాలని స్పష్టం చేశారు. జిల్లాలో అండర్ పాస్ రహదారుల నిర్మాణానికి, ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి గణాంకాలను వివరిస్తూ, రాష్ట్రంలో హత్యల కంటే రోడ్డు ప్రమాదాల వల్ల, ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 7500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, ఇందులో అత్యధికులు ద్విచక్ర వాహనదారులు, పాదచారులే ఉన్నారని తెలిపారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను వీడి, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ఆయన కోరారు. ?ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి, రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తమ నియోజకవర్గంలో పకడ్బందీ చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మరియు ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేముల వీరేశం సుమారు 2000 మందికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రమాద సమయంలో ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన, వెంకన్నకు కేంద్ర ప్రభుత్వ పథకం కింద 25వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని 40 మంది సర్పంచ్‌లు, తమ గ్రామాల్లో హెల్మెట్ నిబంధనను కఠినంగా అమలు చేస్తామంటూ తీర్మాన పత్రాలను మంత్రికి అందజేశారు. సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులందరితో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించడంతో ఈ కార్యక్రమం ముగిసింది.

## చేపల వేటలో విషాదం... కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఏప్రిల్ 15:** మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన బుట్టి నాగయ్య (40) చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుతాఘాతానికి గురై మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నాగయ్య వజీరాబాద్ మేజర్ కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. కాలువ పక్కనే ఉన్న పేయ్యాల సుగుణమ్మ ఇంటి వద్ద ఉన్న విద్యుత్ బోర్డులో నుంచి వైరు తీసుకొని చేపలు పట్టేందుకు కాలువలో దిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.మృతుడి భార్య బుట్టి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# నిమ్జ్ భూముల స్వాధీనం 45 రోజుల్లో పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రావీణ్య





**సంగారెడ్డి,క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 15:** జహీరాబాద్ పారిశ్రామిక వాడలోని జాతీయ పెట్టుబడి మరియు తయారీ మండలి పరిధిలో మొదటి దశలో సేకరించిన 3245 ఎకరాల భూమిని 45 రోజులలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఈ భూమిని కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, నిమ్జ్, టీజీఐఐసీ అధికారులు, ఏఈఓలు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిమ్జ్ ఫేజ్--× పరిధిలో మిగిలి ఉన్న ఎల్గోయి, సిద్ధాపూర్, చిలేపల్లి, ముంగి, రుక్మాపూర్, హద్నూర్ గ్రామాల్లో భూముల స్వాధీనానికి ప్రత్యేకంగా 6 బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి బృందంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు సమీక్ష ద్వారా పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఫెన్సింగ్ క్లియరెన్స్, రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలని, ప్రస్తుతం సాగులో ఉన్న పంటల కోత పూర్తైన వెంటనే భూములను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా ఫెన్సింగ్ తొలగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అలాగే చెట్లు, పొదలు, రాళ్లు వంటి అవరోధాలను తొలగించి భూమిని సమానంగా లెవెలింగ్ చేయాలని, రోడ్ల లొకేషన్‌ను ఖరారు చేసి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ విట్టల్, జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా, డీఎస్పీ సైదులు నాయక్, నిమ్జ్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ కుమార్, వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ కార్మికులకు పోస్టల్ ఇన్సూరెన్స్ పత్రాలు అందజేత

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ సహకారంతో**

క్రైమ్ మిర్రర్ వలిగొండ:భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు పల్లెర్ల నరసింహ ఆధ్వర్యంలో వలిగొండ గ్రామపంచాయతీ కార్మికులకు పోస్టల్ ఇన్సూరెన్స్ ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ సహకారంతో గ్రామపంచాయతీ కార్మికులకు పోస్టల్ ఇన్సూరెన్స్ పత్రాలను అందించడం జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమాన్ని చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పారిశుద్ధ్య కార్మికులు ఎనలేని సేవ చేస్తున్నారని, అందుకు వారి ఆరోగ్యంగా ఉంటూ, వారి కుటుంబాలను ఎల్లప్పుడూ కాపాడుకోవాలని వారికి వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం కోసం కార్యక్రమాన్ని చేపట్టారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులుబందారపు లింగస్వామి,రాచకొండ కృష్ణ,రాములు,రామ నర్సు,రాస వెంకట్, శ్రీనివాస్,వార్డ్ మెంబర్ అరుణ్,జగన్,పద్మా రెడ్డి, మండల పదాధికారులు నాగరాజు,దయాకర్ వెంకటేశం,వెంకటేశం, జంగయ్య,కార్మికులు,తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య**



**సంగారెడ్డి,క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 15:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని గిరిజన బాలుర న్యాయ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశానికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి మూల సూత్రాలను అందించారని తెలిపారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొంటూ, బాలల సంరక్షణ చట్టం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక నిరోధక చట్టం, అలాగే భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, అవసరమైతే సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన..!!

**బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మేడిగడ్డ పర్యటన నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ బుధవారం పరిశీలించారు. సీఎం బహిరంగ సభ నిర్వహణకు అనువుగా ఉన్న కాటారం మండలం నస్తూర్ పల్లిలో సభా వేదిక, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు మౌలిక సదుపాయాలను అధికారులతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ బాబు, కాటారం డిఎస్పీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి,క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 15:జిల్లాలో ఉపాధి హామీ పథకంకింద చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దిష్ట కాలపట్టికలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, డిఆర్డిఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన పాఠశాలల కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని సూచించారు. పనుల ప్రగతి సంతృప్తికరంగా లేని చోట వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆలస్యం జరగకుండా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలల్లో కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు భద్రత కల్పించాలని తెలిపారు.మహిళా సంఘ భవనాల నిర్మాణం ద్వారా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు బలోపేతం అవుతాయని, ఈ పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పర్యవేక్షణ పెంచి పనుల నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశించారు. డిఆర్డిఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను సమయానికి పూర్తి చేయాలని, పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, పీడీ డిఆర్డిఏ జ్యోతి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య ద్వారానే పాఠశాలల పురోగతి




**నూతనకల్ క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా తల్లిదండ్రులకు పాఠశాలల పట్ల నమ్మకం కలిగటంతో ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం అవుతాయని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఎర్రపహాడు ఆధ్వర్యంలో రైసింగ్ ఎర్రపహాడు పేరిట మహా బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఎర్రపహాడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుండి మండల కేంద్రం వరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సామ సవేందర్ రెడ్డి తన సొంత ఖర్చులతో నిర్వహించిన మహా బడిబాట ర్యాలీ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గిరిధర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రవేట్ పాఠశాలకు దీటుగా విద్యను బోధిస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఒత్తిడి లేని నాణ్యమైన విద్య విద్యకై ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను పంపాలని, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారంతో ఆర్థిక ఇబ్బందులకు గురికాకూడదని సూచించారు. మన ఊరు మనబడి ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని అన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సవేందర్ రెడ్డి చొరవ తీసుకుని పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంపొందించేందుకు అనేక ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు .విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించేందుకు క్రమశిక్షణతో సమయపాలన పాటించేందుకు తన సొంత ఖర్చులతో గతంలో అల్లారం గడియారాలను కూడా అందజేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు స్కూల్ ఏకరూప దుస్తులు,,మపుస్తకాలు, నోట్ బుక్స్ మధ్యాహ్నం సన్న బియ్యంతో నాణ్యమైన ఉచిత భోజనం పౌష్టిక ఆహారం అందించేందుకు వారంలో మూడు రోజులు కోడిగుడ్ల వంటివి అందిస్తుందని వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశాలమైన చక్కటి వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, మంగళపల్లి నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనంతుల కళావతి పాఠశాల సిబ్బంది యాస జ్యోతి సామ సురేందర్ రెడ్డి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దంతాల వెంకటయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..



## ప్రేమ్ నగర్ బీ బ్లాకులో పర్యటించిన మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ ..

**కొండాపూర్ క్రైమ్ మిర్రర్ :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని, ప్రేమ్ నగర్ బీ బ్లాకులో బుధ వారం రోజు కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ జీహెచ్ఎంసీ అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులు స్థానిక నాయకులు, ప్రజలతో కలసి క్షేత్ర స్థాయిలో పర్యటించి, పలు సమస్యలు తెలుసుకోవటం జరిగింది. ఈ సందర్భంగా ప్రేమ్ నగర్ బీ బ్లాకులో జరుగుతున్న సీవరేజ్ అవుట్ లెట్ పైప్ లైను పనులను హమీద్ పటేల్ గారు, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ వాటర్ వర్క్స్ అధికారి సందీప్ తో కలసి పరిశీలించటం జరిగింది. పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులను నిర్వహించాలని కాంట్రాక్టర్ కు సూచించటం జరిగింది. తధానంతరం ప్రేమ్ నగర్ ఏ బ్లాకు నుండి, ప్రేమ్ నగర్ బీ బ్లాకులోకి ఉన్న చిన్న ఓపెన్ నాలా యొక్క సమస్యను స్థానిక నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శిరీష, ఏఈ భాస్కర్ గార్లతో కలసి పరిష్కారం దిశగా సమాలోచనలు, చర్చలు జరపటం జరిగింది. యుద్ధ ప్రతిపదికన స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు కొరకు ప్రతిపాదన చెయ్యాలనిఈ సందర్భంగా అధికారులకు కోరటం జరిగింది. కాలనీలో కట్టిన భవనాలు, పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకొని, ఓపెన్ నాలా యొక్క విస్తీర్ణం పెంచాలని, రానున్న వర్షం కాలంలోపే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు హమీద్ పటేల్ సూచించారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ తో బాటుగా జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శిరీష, ఏఈ భాస్కర్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, వాటర్ వర్క్స్ అధికారులు సందీప్, స్థానిక సీనియర్ నాయకులు యన్ రూపారెడ్డి, డాక్టర్ రమేష్, గొళ్ళెం యాదగిరి, గిరి గౌడ్, వెంకటేష్ యాదవ్, అబేద్ అలీ, రాజు, రాజీ రెడ్డి, సైదులు, సత్తిబాబు, మల్లేష్, కచ్చావా దీపక్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమం

**అంగన్వాడి సూపర్వైజర్ కవిత**

**చిట్టిగిద్దలో పోషన్ పక్వాడ్ పై అవగాహన కార్యక్రమం.**



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** చిన్నారులలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నవాబుపేట అంగన్ వాడీ సూపర్వైజర్ కవిత అన్నారు.వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో టీచర్ హంస ఆధ్వర్యంలో బుధవారం పోషన్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా సూపర్ వైజర్ కవిత హాజరై మాట్లాడారు. గర్భధారణ దశ నుంచే తల్లులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.రక్తహీనత లేకుండా పోషకాహారం తీసుకోవడం ద్వారా హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకోవచ్చన్నారు.డెలివరీ తరువాత వెంటనే శిశువుకు ముర్రుపాలు ఇవ్వడం ఎంతో ముఖ్యమని, దాని ద్వారా శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన మొదటి నెల నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించడం అత్యంత అవసరమని, ఈ కాలాన్ని "గోల్డెన్ డేస్"గా పేర్కొన్నారు. అలాగే రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను భాగంగా చేర్చుకోవాలని, అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.చిన్నారులకు, కిశోర బాలికలకు పౌష్టికాహారం తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో పోషన్ పక్వాడ్ పై ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీధర్ రావు, గర్భిణీలు, బాలింతలు,చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు

# బస్టాండ్ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని బిజెపి ధర్నా

## ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు



**చౌటుప్పల్, ఏప్రిల్ 15,క్రైమ్ మిర్రర్:** యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ జాతీయ రహదారిపై నేర్పిస్తున్న ఫ్లై ఓవర్ వంతెన ప్రణాళికలను మార్పులు చేసి నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ భాజపా పట్టణ కమిటీ అధ్యక్షురాలు కదారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారిపై స్థానిక బిజెపి నాయకులు ధర్నా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ అరహదారిపై ప్రభుత్వం గతంలో రూపొందించిన ప్రణాళిక ప్రకారమే చౌటుప్పల్ ఆర్టిసి బస్ స్టేషన్ ఎదురుగా అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యం రద్దీగా ఉండి డిపో ఏర్పాటుకు కావాల్సినంత స్థలం ఉన్నటువంటి బస్ స్టేషన్ ముందు అండర్పాస్ నిర్మాణం తప్పనిసరి అని తెలిపారు. పూర్వపు కొలతల ప్రకారమే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇందుకు విరుద్ధంగా నిర్మాణం చేపడితే ప్రజా ఉద్యమాలతో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో వి శేఖర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కదారి కల్పన ఐలయ్య యాదవ్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రమణగొని శంకర్, సీనియర్ నాయకులు శాగ చంద్రశేఖర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ఉడుగు వెంకటేశం, 2వ వార్డ్ కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య,6వ వార్డ్ కౌన్సిలర్ ఆలే శ్రీలత చిరంజీవి,18వ వార్డు కౌన్సిలర్ బుడ్డా సురేష్, దిండు భాస్కర్, అమృతం దశరథ, గుర్రం రవీందర్, గుండెబోయిన వేణు, బత్తుల పురుషోత్తం, పబ్బతి శేఖర్, ఉష్కాగుల నాగరాజు, గంట్ల బుచ్చిరెడ్డి, కానుగు కొండల్, జి వెంకటరెడ్డి, బి గణేష్, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం కీలకం

**మున్సిపల్ చైర్మన్ డాక్టర్ గుడిశెల సంధ్యారాణి**

**విద్యానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా 'జాతీయ పోషణ పక్షం'**

**బాలింతలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన చేసిన చైర్మన్**

**జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని తల్లులకు సూచన**



**రామకృష్ణాపూర్ ఏప్రిల్ 15:** పిల్లలు శారీరకంగా, మానసికశక్తితో ఎదగాలంటే గర్భిణీలు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ గుడిశెల సంధ్యారాణి,రాజా రమేష్ పేర్కొన్నారు. బుధవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు విద్యానగర్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో 'జాతీయ పోషణ పక్షం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన,అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సమతుల్య ఆహారం వల్ల పిల్లల ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని తెలిపారు. నేటి కాలంలో పిల్లలకు జంక్ ఫుడ్, ప్యాకెట్ ఆహారం అలవాటు చేయడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు పండ్లతో ఇంట్లో వండిన ఆహారాన్నే చిన్నారులకు అందించాలని తల్లులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు,ఐసిడిఎస్ సూపర్ వైజర్ కె. సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్ బి. అనిత ,గర్భిణీలు, బాలింతలు,చిన్నారుల తల్లిదండ్రులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాలో LPG గ్యాస్ కొరత లేదు

## ఇంటి వద్దకే సరఫరా: కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి,క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 15:** జిల్లాలో ఎల్పీజీ వంట గ్యాస్ కొరత లేదని, ప్రతి ఇంటికీ ఎటువంటి అంతరాయం లేకుండా సమయానికి గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఎల్పీజీ సరఫరా మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ మాధురి సంయుక్తంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ, పోలీస్ శాఖ అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. వినియోగదారులకు అవసరమైన వంట గ్యాస్‌ను ఇంటి వద్దకే సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రుల్లో గ్యాస్ సరఫరా పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, ఎక్కడా కొరత రాకుండా నిరంతర సరఫరా కొనసాగించాలని సూచించారు. గ్యాస్ పంపిణీలో అక్రమాలు జరగకుండా విజిలెన్స్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా సరిపడా స్టాక్ నిర్వహించడంతో పాటు అదనంగా 15 శాతం నిల్వలను తప్పనిసరిగా ఉంచాలని పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీలు ముందుగానే స్టాక్ సమకూర్చుకుని, వినియోగదారుల బుకింగ్‌లను ఖచ్చితంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుని ఇంటింటికీ గ్యాస్ సరఫరా జరిగేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, రవాణా శాఖ అధికారిణి అరుణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, డీఎల్ఎంఓ అనిల్ కుమార్, ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి,క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 15:** జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దిష్ట విధానాలతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఇండ్ల గణన నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మే 11 నుంచి ప్రారంభమయ్యే మొదటి దశ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన విధానాలను పాటిస్తూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఈ నెల 18 నుంచి మే 5 వరకు శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు. అదేవిధంగా, స్వయంగా వివరాలు నమోదు చేసుకునే వారికి ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, సీపీఓ కార్యాలయ ఏడి గీత, ఎం.కె. నాయక్, ఇంద్రసేనారెడ్డి, ఈడీఎం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం అక్రమ రవాణాకు చెక్.. నిబంధనలు ముల్లంగిస్తే కఠిన చర్యలు

## జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్




**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లాలోని రైతులకు మద్దతు ధర సమర్థంగా అందించేందుకు ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకునే దిశగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం కాలేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ మరియు పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో 24 గంటలు నిరంతర పహారా నిర్వహిస్తాయని వెల్లడించారు. జిల్లా రైతుల ప్రయోజనాలను కాపాడడం మరియు వారికి న్యాయమైన మద్దతు ధర లభించేలా చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం రాకుండా పటిష్ట నియంత్రణ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టు ద్వారా వాహనాల తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించబడతాయని, నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాములు, ఎస్.ఐ తమాషా రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీమతి శ్రీజ, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు సురేందర్ రెడ్డి, రాజు, గ్రామ పరిపాలన అధికారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ కళా దినోత్సవ వేడుకలు

**క్రైమ్ మిర్రర్ పాలేరు:** ఖమ్మంజిల్లా నేలకొండపల్లిలో గల భక్త రామదాసు ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ కళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. తదనంతరం సంఘం సభ్యులు కేక్ కటింగ్ చేశారు. ఖమ్మం జిల్లా కళాకారుల సంఘం తెల్లగొర్ల లింగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు లియొనార్డో డావెన్సీ పుట్టినరోజు సందర్భంగా ఆయన గౌరవార్థం ఈ ప్రపంచ కళా దినోత్సవం 2012 నుండి నిర్వహిస్తున్నారని తెలియజేశారు. కళ అనగా సృజనాత్మకత, ప్రతిభ అని అన్నారు. ప్రపంచంలో 64 కళలు ఉన్నాయని ఎవరి కళలో వాళ్ళు ముందుకు వెళ్లాలని తెలియజేశారు. కళలు ఉండడంవల్ల మనసులో ఉత్సాహం పెరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ నంది అవార్డు గ్రహీత కవి సామ్రాట్ చిలకాబత్తిని వీరబాబు, బిజెపి పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు, తునికి పార్టీ లక్ష్మణాచారి, ఏపూరి సత్యనారాయణ,భిక్షం నాయక్, సూరేపల్లి జ్ఞానరత్నం, కట్టెకోల వెంకటేశ్వర్లు, కుక్కల ప్రభాకర్, లొడంగి కొండలు, లక్ష్మణ చారి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# బీఆర్ఎస్‌లో కష్టపడి పని చేసేవారికి పదవులు

**తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి**

**శంషాబాద్, కొత్వాల్‌గూడ డివిజన్‌లకు బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్‌గా దేవరంపల్లి బుచ్చిరెడ్డి నియామకం**

గండిపేట(క్రైం మిర్రర్): బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలు అన్నారు. శంషాబాద్, కొత్వాల్‌గూడ డివిజన్‌లకు బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్‌గా శంషాబాద్ ఆర్‌బీనగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు దేవరంపల్లి బుచ్చిరెడ్డిని నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ నిబద్ధతతో పని చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొంటూ పార్టీ, కార్యక్రమాలను విజయవంతం చేయడంలో విశేషంగా కృషి చేసినందుకు గుర్తింపుగా ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకత్వం తెలిపింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే నాయకులకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని, దేవరంపల్లి బుచ్చిరెడ్డి తన



బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ శంషాబాద్ సర్కిల్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలతో సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంలో బుచ్చిరెడ్డి కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, సబితా ఇంద్రారెడ్డి, కార్తిక్ రెడ్డికి దేవరంపల్లి బుచ్చిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని, కార్యకర్తలందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్, కొత్వాల్‌గూడ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంఛర్ల శ్రీనివాస్ (ప్రధాన కార్యదర్శి), చిన్నగందు రాజేందర్, సలివెంద్రి వెంకట్ రెడ్డి, వీరమల్ల హన్మంత్ ముదిరాజ్, జయసింహ, గుంటి చరణ్, పెట్రోల్ సాయి గౌడ్, పవిత్ర సాగర్, పరంధాములు, రాచమల్ల రమేష్, బత్తుల మహేష్ యాదవ్, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్య కార్మికులకు గౌరవప్రదంగా సన్మానం

**భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి**

గండిపేట(క్రైం మిర్రర్): పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించుకుంటూ గౌరవప్రదంగా సన్మానించుకోవడం అందరి బాధ్యత అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర బీజేపీ పార్టీ ఆదేశాల మేరకు బుధవారం కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు గోద పాండుయాదవ్ ఆధ్వర్యంలో పల్లెచెరువు అంబేద్కర్ విగ్రహం వద్ద పారిశుధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పారిశుధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యాని దృష్టిలో ఉంచుకోని ప్రతి రోజు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో వారి శ్రమ మరువలేనిదన్నారు. అలాగే కార్మికుల సేవలను కొనియాడడం జరిగింద. వారిని గౌరవప్రదంగా పార్టీ నాయకులతో కలిసి శాలువాలతో సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల జవాన్ శేఖర్, కార్మికులు, బీజేపీ సీనియర్‌నాయకులు రావుల భాస్కర్, డివిజన్ మాజీ అధ్యక్షులు అడికే జనార్ధన్, కృష్ణ, సంతోష్ గౌడ్, సి.హెచ్.వెంకటరమణగుప్తా, బబ్లు, బి.నర్సింహ్మా, మజర్, సురేష్, ఎన్ను శంకర్‌రెడ్డి, రామారావు, శేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంజీఐటీలో ఘనంగా వరల్డ్ క్వాంటం డే వేడుకలు



గండిపేట(క్రైం మిర్రర్): మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వరల్డ్ క్వాంటం డేను పురస్కరించుకోని ఘనంగా విద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ప్రముఖ పరిశోధకులు డాక్టర్ ఎస్.బాలకృష్ణన్ క్వాంటం ఫినామినా ఇన్ బయోలాజికల్ సిస్టమ్స్(జీవ వ్యవస్థలలో క్వాంటం దృగ్విషయాలు) అనే అంశంపై ఆన్‌లైన్ ద్వారా విశేష



ప్రసంగం చేశారు. డాక్టర్ బాలకృష్ణన్ మాట్లాడుతూ భౌతిక శాస్త్ర పరిణామ క్రమాన్ని, క్లాసికల్ ఫిజిక్స్ నుంచి క్వాంటం మెకానిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వరకు సాగిన ప్రయాణాన్ని వివరించారు. ముఖ్యంగా క్వాంటం బయోలజీ గురించి వివరిస్తు వలస పక్షులు భూమి యొక్క అయస్కాంత క్షేత్రాన్ని గుర్తించబడానికి వాటి కళ్లలోని క్వాంటం-సెన్సిటివ్ కంపాస్సు ఎలా ఉపయోగిస్తాయో వివరించారు. ఎంజైమాటిక్ ప్రతి చర్యలలో ప్రోటాన్లు/ఎలక్ట్రాన్ల క్వాంటం టన్నెలింగ్ ద్వారా రసాయన మారుపలు ఎంతో వేగంగా జరుగతాయన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి రంగంలోనూ క్వాంటం మెకానిక్స్ , క్వాంటం కంప్యూటింగ్ ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అంతా క్వాంటం కంప్యూటింగ్‌దేనని, విద్యార్థులు ఈ దిశగా ప్రాజెక్టులు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆర్‌అండ్‌డి అడిషనల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.కె.సింగ్ మాట్లాడుతూ క్వాంటం ఫిజిక్స్ ఆవిర్భావం, ఆధునిక సాంకేతికతలో దాని ప్రాముఖ్యతను వివరించాఉ. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగం హెడ్ డాక్టర్ ఎం.రవిచందర్, ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.వేణుగోపాల్‌రావు, ఎంజీఐటీ, సీబీఐటీ కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలిపిన సిఐటియూ

గండిపేట(క్రైం మిర్రర్): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న అర్జిన్ ఉద్యోగులకు సిఐటియూ పూర్తి మద్దతు తెలుపుతుందని సిఐటియూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అన్నారు. విధులను బహిష్కరించి ఆందోళన బాట పట్టిన సమ్మెకు మద్దతుగా గండిపేట మండల కోకాపేట్‌లో జీహెచ్‌ఎంసీ వర్కర్స్ యూనియన్ నార్సింగి అధ్యక్షులు, సిఐటియూ కన్వీనర్ మైపాల్‌యాదవ్ అధ్యక్షతన సిబ్బందికి సీఐటీయూ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్స్ ఉద్యోగుల నిజమైన సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె న్యాయమైనదన్నారు. తమకు సమాన పనికి సమాన వేతనం కావాలంటూ ఆందోళన బాట పట్టారన్నారు. ఇప్పటికే ఎన్ని రోజులు అవుతున్న యాజమాన్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలవకుండా కాలయాపన చేస్తూ మరొకవైపు భయభ్రాంతులకు గురి చేస్తున్నదన్నారు. ఇతర కార్మికులతో పనులు చేయిస్తామని బెదిరిస్తూ నిర్బంధానికి గురిచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిసన్ ఉద్యోగులు ఆరు ప్రధాన డిమాండ్లతో ఆందోళన బాట పట్టారున్నారు. విధులను బహిష్కరించి సమ్మెకు దిగారన్నారు. ఆర్టీసన్ ఉద్యోగులలో విద్యార్హతలను బట్టి ఉద్యోగుల కన్వర్షన్ చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్స్ అంటే ప్రస్తుతం ఉన్న ఓ అండ్ ఎం సర్వీస్ రూల్స్ ను అమలు చేయాలన్నారు. 2016 డిసెంబర్ కన్నా ముందు నుండి విద్యుత్ సంస్థలో పనిచేస్తూ నేటికి అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని ఆర్టీసన్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. విద్యుత్ సంస్థల్లో



పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలన్నారు. 2026 పి ఆర్ సి వేతన సవరణ తక్షణమే అమలు చేయాలన్నారు. ఆరు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం యాజమాన్యం తక్షణమే అమలు చేయాలంటూ 10 యూనియన్లు కలిసి ఈ పోరాటం చేయడం ఐక్యమత్యానికి నిదర్శనంన్నారు . ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు విధానాలు ఎందుకు అంటూ వారు ప్రశ్నించారు రెగ్యులర్ ఉద్యోగులు చేస్తున్న ప్రతిపని ఆర్టిసన్ గా తాము కూడా చేస్తున్నామని అని పని ఒకటే అయినప్పుడు విధానాలు రెండు ఎందుకు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఆర్టిసన్ వ్యవస్థ ఏర్పడినప్పుడు 2016 డిసెంబర్ కటాఫ్ తేదీగా ప్రభుత్వం నిర్ణయించింది. ఏదైనా కారణాల వల్ల అంతకంటే ముందుగా అవుట్సోర్సింగ్ కాంట్రాక్టర్ కార్మికులుగా పనిచేస్తున్న వారు ఆర్టిసన్ గా నమోదు చేయించుకోలేకపోయారని కానీ వారిని కూడా ఆర్టిసన్ గా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంతో పోలిస్తే నేడు వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఎంతో మెరుగుపడిందని అది ఆర్టిసన్ ఉద్యోగుల పనికి నిదర్శనంగా పేర్కొన్నారు. ఎవరిని ఇబ్బంది పెట్టాలని తమ ప్రధాన ఉద్దేశం కాదని ప్రతి వినియోగదారుడు



మాకు ఆప్తమిత్రుడు అని తెలిపారు. విద్యుత్ సంస్థ యాజమాన్యం మొండివైఖరి మరి ప్రభుత్వం మొండి వైఖరి వల్లనే తాము ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న పిఎస్ రేటు కార్మికులకు 2026 వేతన సవరణ అమలు చేయాలి జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి స్టాండింగ్ ఆర్డర్స్ రూల్స్ రద్దుచేసి ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్స్ ను అమలు చేయాలి తమ డిమాండ్లను యాజమాన్యం ప్రభుత్వం ఆమోదం తెలిపేంతవరకు ఆందోళన విరమించేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తే రాష్ట్రం అంధకారంలోకి పోతుందంటూ ఆర్టిసన్స్ ఉద్దేశించి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బచ్చలకూర స్వామి, జిహెచ్ఎంసి యూనియన్ కార్యదర్శి, నాయకులు ఎస్ జనార్దన్ రెడ్డి, జనార్ధన్, అరుణ్, నాయకులు, ఆర్టిజన్ల కార్మికులు సిఐటియు ఆర్టిజన్ వర్కర్స్ యూనియన్ నాయకులు నర్సింగ్ రావు, జెసి నాయకులు మనోజ్, రమేష్, ఇమ్రాన్, మమత, రమ్య, జనార్ధన్, ఈశ్వర్, రాము, రాజు, యాదయ్య, కార్మికులు పాల్గొన్నారు.

# విద్యుత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

## మణికొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు

గండిపేట(క్రైం మిర్రర్): విద్యుత్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మణికొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్? కార్మికులు తమ సేవల రెగ్యులరైజేషన్, సమాన వేతనాలు, అలవెన్సులు కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 19 వేల మంది కార్మికులు తమ న్యాయబద్ధ హక్కులు, గౌరవం కోసం కొనసాగిస్తున్న నిరవధిక సమ్మె బువవారం 8వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మణికొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు నార్సింగిలోని టిజిఎస్పిడిసిఎల్ డిఈ(ఆపరేషన్స్?) కార్యాలయాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపి సమ్మెలో కూర్చున్నారు. కొంత మంది కార్మికులకు గత మూడు సంవత్సరాలుగా వేతనాలు చెల్లించడం లేదని, ఎసెన్షియల్ సర్వీసేస్ మెయిటైనెన్స్? యాక్ట్?ను ప్రయోగించడం వల్ల ప్రమాద భీమా ప్రయోజనాలను కోల్పోవడం జరిగిందన్నారు. అందుకు మానసిక వేదనలకు గురవుతున్నారన్నారు.



ప్రభుత్వం తక్షణమే సమ్మె చేస్తున్న కార్మికులతో అర్థవంతమైన చర్చలు ప్రారంభించాలని, ఎస్మాను ఆలస్యం లేకుండా ఉపసంహరించుకోవాలని, ప్రమాద భీమా ప్రయోజనాలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. న్యాయం, సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఈ కార్మికుల నిజమైన సమస్యలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, షేక్ ఆరిఫ్, ఆరిఫ్‌మొహమ్మద్, బొడ్డు శ్రీధర్, సుమనళిని, దేవిప్రియ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్పేట్ బిజెపి అధ్యక్షులు రామకృష్ణారెడ్డి ఆత్మహత్య

**ప్రశ్నించే గొంతు మూగబోయిందని బడంగ్పేట్ ప్రజానీక ఆవేదన**



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) జిహెచ్ఎంసి పరిధి బడంగ్పేట్ క్లస్టర్ వన్ భారత జనతా పార్టీ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. నాదర్గుల్లోని కింగ్స్ వే కాలనీలో నివాసం ఉండే రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి బడంగ్పేట్ క్లస్టర్ వన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ అంతే స్థాయిలో అవినీతి పై పోరాటం ధైర్యంగా కొనసాగించాడు. రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని తెలుసుకున్న మీర్పేట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని, ఆత్మహత్యకు గల కారణాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడతామని మీర్పేట్ పోలీసులు తెలిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ అవినీతిపై ధైర్యంగా ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న రామకృష్ణారెడ్డి మృతి పై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతు మూగబోయిందని బడంగ్పేట్ ప్రజానీకం తమ ఆవేదనను తెలిపారు.

# రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్




గండిపేట(క్రైం మిర్రర్): రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్(సురక్షిత ప్రయాణం) ప్రచారంలో భాగంగా మూడవ రోజు శివరాంపల్లిలోని జెడ్‌పిహెచ్ఎస్, ఆరాంఘర్ కూడలి వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబిన్ 10 ఈ రెండు ప్రదేశాలలోనూ సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన జెడ్‌పిహెచ్ఎస్, రాఘవేంద్ర పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. రహదారి భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపవద్దు అన్నారు. హెల్మెట్లు, సీటు బెల్టుల అవశ్యకత ఎంతో ఉందన్నారు. అతివేగం వల్ల కలిగే ప్రమాదాలను గుర్తించాలన్నారు. రోడ్లు దాటే సమయాల్లో జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించుకోవాలన్నారు. పాదచారుల భద్రత, రహదారి దాటే నియమాలు ఖచ్చితంగాపాటించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ప్రజలలో అవగాహన కల్పించే లక్ష్యంతో విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు, వివిధ శాఖల అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది, శాంతిభద్రతల విభాగం సిబ్బందితో కలిసి ఒక మానవహారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ భద్రతకు సంబంధించిన నినాదాలను గట్టిగా వినిపించారు. అనంతరం ఆరాంఘర్ కూడలిలో హెల్మెట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి ట్రాఫిక్--3 రామదాస్ తేజావత్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో సి.హెచ్.రాజు, ఆర్ఐ ఆర్.గణేష్, రాజేంద్రనగర్ లాఅండ్ఆర్డర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, కొండాపూర్ ఏఎంవీఐ మనోజ్, ఆర్అండ్‌బి ఏఈఈ విజయ్, జెడ్‌పిహెచ్ఎస్ జీహెచ్ఎం బి.శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.



# శంషాబాద్‌లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం



గండిపేట(క్రైం మిర్రర్): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం బుధవారం మూడవ రోజు శంషాబాద్‌లోని కాలేజీ, స్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రహదారి భద్రత, హెల్మెట్ వినియోగంపైన అవగాహన కల్పించారు. విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్‌లు పంపిణి చేశారు. ప్రధాన జంక్షన్ వద్ద విద్యార్థులు హ్యూమన్ చైన్‌గా ఏర్పాడి ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను చాటిచెప్పారు. వాహనాదారులు, బాటసారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తామని విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది విలువైన ప్రాణాలను కొల్పోతున్నారని ముఖ్యంగా యువత, మైనర్లు డ్రైవింగ్ చేయడం ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. త్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల మరణాలు పెరుగుతున్నాయని దీనిని అరికట్టాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ చూసి అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు భయం కోసం కాదు, మీ కుటుంబం కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం ట్రాఫిక్ నిబంధనలను పాటించండి, సురక్షితంగా ప్రయాణించి, క్షేమంగా ఇంటికి చేరుకోవడమే అరైవ్ అలైవ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్(ఎల్అండ్‌వో) ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, ఆర్‌జీఐఏ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం, ఆర్‌జీఐఏ(లాఅండ్ ఆర్డర్) ఎస్‌హెచ్‌వో సంజీవులు, ఆర్‌జీఐఏ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో బి.ప్రమోద్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాఠశాల యాజమాన్యం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు

## శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రమోద్‌కుమార్



గండిపేట(క్రైం మిర్రర్): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రమోద్‌కుమార్ తెలిపారు. ట్రాఫిక్ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మొత్తం 32 కేసులు పరిష్కరించబడ్డాయన్నారు. ఫలితంగా మొత్తం జరిమానా 57,500 అయ్యాయి. మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి న్యాయమూర్తి కె.వేణుగోపాల్‌రెడ్డి రాజేంద్రనగర్ 10 స్పెషల్ కోర్టు ముందు హాజరుపరచగా వారికి జైలు శిక్ష, జరిమానా విధించడం జరిగిందన్నారు. రాకేష్‌కుమార్‌కు ఒక రోజు సాధారణ కారాగార శిక్ష, 2500 జరిమానా, సునీల్‌కుమార్‌కు ఒక రోజు సాదారణ కారాగార శిక్ష, 2500 జరిమానా విధించారన్నారు. నర్సిములు అనే వ్యక్తి ఒక రోజు సామాజిక సేవ, 2500 జరిమానా విధించారన్నారు. 12 మంది డ్రంక్ అండ్ డ్రైవింగ్ కింద జరిమానా మొత్తం 25,500 జరిమానా విధించారన్నారు. ఆరు కేసులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నమోదు చేయబడ్డాయి జరిమానా మొత్తం 9 వేలు విధించారన్నారు. ఒక మైనర్ డ్రైవింగ్ చేసిన బండి ఓనర్‌కు రూ.1000 జరిమానా విధించారన్నారు. 10 సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన వ్యక్తులకు రూ.11,500 జరిమానా విధించారన్నారు. ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ రహదారి భద్రతను నిర్ధారింగీ డానికి, ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. పౌరులందరూ జరిమానాలను నివారించడానికి, వారి భద్రతను నిర్ధారించడానికి ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.

# మణికొండలోని అయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఆరోగ్య శిబిరం



గండిపేట(క్రైం మిర్రర్): మణికొండలోని అయుష్మాన్ ఆరోగ్య మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా ఎన్‌సిడి ఆరోగ్య శిభిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిభిరంలో భాగంగా లబ్ధిదారులకు అవసరమైన టీకా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ పూజానాగరి ఆధ్వర్యంలో నిర్వహించగా ఏఎన్ఎంలు యాదమ్మ, స్వప్న, ఆశా కార్యకర్తలు దీపా, సులోచన సమన్వయంతో సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి, మణికొండ బీజేపీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ చైర్మన్ సిద్ధప్ప, రిటైర్డ్ హెడ్ మాస్టర్, రాష్ట్రపతి అవార్డు గ్రహిత, మణికొండ సీనియర్ సిటిజన్ జనరల్ సెక్రటరీ రఘు, సతీష్‌కుమార్ సందర్శించారు. వారు శిభిరం నిర్వహణను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ శిభిరం ద్వారా ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడమే కాకుండా, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడం జరిగింది. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# నార్సింగిలో 'ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అండ్ అలైవ్' రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం

గండిపేట్ క్రైమ్ మిర్రర్: రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మరియు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు అరైవ్ అండ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమం నాల్గవ దశలో భాగంగా బుధవారం నార్సింగి రోటరీ సమీపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, పరిసర కాలనీవాసులు సుమారు 100 మంది పాల్గొన్నారు. నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి. ఆంజనేయులు మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై సూచనలు ఇచ్చారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని అవగాహన పెంపొందించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని అధికారులు కోరారు.

# వైభవపేతంగా భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ శోభాయాత్ర

## జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



కూకట్ పల్లి, ఏప్రిల్ 15 (క్రైమ్ మిర్రర్) : ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీరుడు రాజు ఆధ్వర్యంలో ఎల్లమ్మబండలో భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా అంబేద్కర్ శోభాయాత్ర వైభవోపేతంగా నిర్వహించారు. ఇట్టి శోభాయాత్రకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ తో కలిసి జండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ ప్రపంచ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి రాజ్యాంగ సవరణలను విశ్లేషించి మన దేశానికి రాజ్యాంగాన్ని అందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ నేటి భారతదేశ యువతకు ఆదర్శంగా ఉన్నారని, ఆయన ఆశయాలను కొనసాగించే దిశగా యువతరం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎల్లమ్మ బండ యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మర్రిగూడలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం..



మర్రిగూడ(క్రైమ్ మిర్రర్): మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు, బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఐకెపి మహిళా సంఘం ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన దొడ్డు, సన్నరకం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జె.శ్రీనివాస్, ఎంపీడీఓ మనయ్యతో కలిసి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రామదాసు శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ పాల్వాయి అనిల్ కుమార్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు మేకల జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్ముల వెంకటేష్ గౌడ్, వీరమళ్ళ లోకేష్, కొడలా వెంకట్ రెడ్డి, పాదం రవి, లపంగి నర్సింహా, గుణగంటి నర్సింహా, మాజీ సర్పంచ్‌లు రామావత్ లక్ష్మణ్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, జంగిలి రవి, మాజీ ఎంపీటీసీ తుమ్మల వరప్రసాద్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు అబ్బానగోని రాము యాదవ్ పాల్గొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మునగాల జాగాల్ రెడ్డి, ఎలిమినేటి సత్తిరెడ్డి, మాతంగి నవీన్, బాయికాడి కొండల్, సిలువేరు యాదయ్య, సిర్పంగి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు కారింగు నర్సింహా, యూత్ కాంగ్రెస్ నాయకులు గ్యార వెంకటేష్, వంపు రామ్ చరణ్, ఏపీఎం వెంకటేష్, సంఘ బంధం అధ్యక్షురాలు, వివోఏలు, మహిళా సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## తడి చెత్తను పొడి చెత్తను వేరు వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలి

## ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



కూకట్ పల్లి, ఏప్రిల్ 15 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్.టి.ఆర్ నగర్, పీజేఆర్ నగర్, గురుగోవింద్ సింగ్ నగర్ కాలనీలలో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గతంలో పాదయాత్ర చేసినప్పుడు రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను తొలగించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. అదే విషయన్ని శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, అధికారులతో మాట్లాడి ఎన్.టి.ఆర్ నగర్ కాలనీ లోని పాత వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న చెత్త, మట్టిని తొలగించడం జరుగుతుందని మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తెలియచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాదయాత్ర సమయంలో చెప్పినట్లు ఎన్.టి.ఆర్ నగర్ కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న చెత్తను తొలగించడం జరుగుతుందని అన్నారు. దశల వారీగా అన్ని కాలనీలలోని రోడ్లపై ఉన్న చెత్తను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని, చెత్తను నాలాలలో గాని, రోడ్లమీద గాని, చెరువులలో గాని వేయవొద్దని ప్రజలకు తెలియచేసారు. జిహెచ్ఎంసి సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండుగౌడ్, మల్లేష్, ఖలీమ్, నాగరాజు, సాయి, నరేష్, అక్బర్, ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, ఎస్.ఎఫ్.ఎ మల్లేష్, వెంకటరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతతోనే భవిష్యత్‌కు భరోసా: సీపీ అంబర్ కిషోర్ ఝా

**విద్యార్థుల క్రమశిక్షణపై రామగుండం పోలీస్ కమిషనర్ ప్రశంసలు**

**జైపూర్‌లో ఘనంగా "అరైవ్,అలైవ్" అవగాహన కార్యక్రమం**

**తల్లిదండ్రులకు పోస్ట్ కార్డుల ద్వారా విద్యార్థుల విజ్ఞప్తి**





**జైపూర్ఏప్రిల్ 15 (క్రైమ్ మిర్రర్) :** రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని, ఇది వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. బుధవారం మంచిర్యాల జోన్ జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో నిర్వహించిన అరైవ్,అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి సీపీ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల జోన్ డీసీపీ ఏ. భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ విద్యార్థులతో ముచ్చటించి,వారు ప్రదర్శించిన క్రమశిక్షణను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న నియమాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు వివరించి చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.ట్రాఫిక్ నియమాలను పాటిస్తామని, ఇతరులతో పాటించేలా కృషి చేస్తామని విద్యార్థులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు పోస్ట్ కార్డుల ద్వారా లేఖలు రాశారు. "తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి, సీట్ బెల్ట్ పెట్టుకోండి, ట్రాఫిక్ నియమాలు పాటించి క్షేమంగా ఇంటికి రండి" అంటూ రాసిన లేఖలను విద్యార్థులు పోస్ట్ చేశారు.ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులు వేసిన చిత్రాలను సీపీ, డీసీపీలు పరిశీలించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జైపూర్ సీఐ నవీన్, ఎస్ఐ రాజశేఖర్, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాజాసేవలో, చదువులోను రాణిస్తున్న హంసిక దేవా



**కూకట్ పల్లి, ఏప్రిల్ 15 (క్రైమ్ మిర్రర్) :** లోధా మెరిడియన్‌లో నివసిస్తున్న విద్యార్థిని హంసిక దేవా ఎం.పి.సి ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 530కి 527 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడవ ర్యాంకు సాధించింది. మొత్తం ఇంటర్మీడియట్‌లో 1000కి గాను 989 మార్కులతో రాష్ట్రంలో 9వ ర్యాంకు సాధించింది. కాలేజీ యాజమాన్యం నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని ఇంట్లో నుంచే చదువుకుంటూ, పాఠ్యేతర కార్యకలాపాలపై సమాన దృష్టి పెట్టింది. మెడిటేషన్‌పై పుస్తకం రాసి ప్రచురించడం, బ్లూ క్రాస్ వంటి సంస్థలతో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, ఆసుపత్రుల్లో కాన్సర్ రోగులకు సేవ చేయడం, మెడిటేషన్ తరగతులు నిర్వహించడం, అనాథాశ్రమంలోని పిల్లలకు సహాయం చేయడం వంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుంది. అలాగే, తన సొంతంగా అసెంట్ ఏవోఐ సర్కిల్ సంస్థను స్థాపించి, ఏం యూ ఎన్ ల్ బిజినెస్ నెట్‌వర్కింగ్ కార్యక్రమలల్లో చురుకుగా పాల్గొంటుంది. ఈ విధంగా చదువుతో పాటు ఇతర కార్యకలాపాలను సమతుల్యం చేస్తూ ఈ విజయాన్ని సాధించడం గర్వకారణమని కాలేజీ యాజమాన్యం అభినందనలు తెలిపింది. భవిష్యత్తులో టాప్ యూనివర్సిటీలో బీబీఏ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న హంసిక దేవాకు కుటుంబ సభ్యులు పూర్తి సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

## గణేష్ గుప్తా, ఆయిల్ కుమార్, అజయ్. బండి గోపాల్ యాదవ్. ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో విషు పూజలు

**బండి గోపాల్ యాదవ్, మహేష్ గురు స్వామి పాల్గొన్నారు -- అయ్యప్ప ఆలయంలో భక్తి వెల్లివిరిసింది**



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** శంషాబాద్ సర్కిల్‌లో గల శ్రీ హరి హర సుత అయ్యప్ప స్వామి దేవాలయంలో విషు (తమిళ ఉగాది) సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఈరోజు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి.

అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు ఆర్. గణేష్ గుప్తా, మాజీ కౌన్సిలర్లు ఆయిల్ కుమార్, అజయ్ ఆధ్వర్యంలో ఉదయం 5:30 గంటలకు లక్ష్మీ గణపతి హోమం ప్రారంభమై, అనంతరం సుబ్రమణ్య స్వామి మూల మంత్ర హోమం, అయ్యప్ప స్వామి మూల మంత్ర హోమం నిర్వహించారు. ఆపై మహా మంగళ పూర్ణాహుతి, స్వామివారికి అష్టద్రవ్య అభిషేకం, కైనేటం పూజ, మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, ఆంజనేయులు గురు స్వామి. మహేష్ గురు స్వామి,టీడిపి జంగయ్య. దేవాలయం పంతులు శర్మ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయబడింది. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు అయ్యప్ప సేవా సమితి సభ్యులు, స్థానిక భక్తులు సహకరించారు.

## పదోన్నతి పొందిన పరికిపండ్ల నరహరి కి అభినందనలు : గాజుల మధు

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మధ్యప్రదేశ్ క్యాడరుకు చెందిన పరికిపండ్ల నరహరి ఐఏఎస్ కేంద్ర సర్వీసులో భూ వనరుల ల్యాండ్ రీసెర్చ్ శాఖలో ఐదేళ్ల కాలానికి జాయింట్ సెక్రటరీగా ఢిల్లీలో నియమితులయ్యారు. వీరి నియమాకాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భాజపా సీనియర్ నాయకులు గాజుల మధు తెలిపారు.



## భాషిత జూనియర్ కాలేజీ అక్రమాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి... ఎన్ ఎస్ యు ఐ డిమాండ్

**భాషిత జూనియర్ కాలేజీకి కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని తక్షణమే రద్దు చేయాలి**

**ఒకే కోడ్ కింద మూడు వేర్వేరు క్యాంపస్లను నిర్వహిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు...?**

**విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న వారిని సహించేది లేదు**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 15 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ తరఫున గొల్ల జాన్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కుందన్ యాదవ్‌తో కలిసి బుధవారం అకాడమిక్ జాయింట్ సెక్రటరీ కె. వసుంధరా దేవి కి వినతిపత్రం సమర్పించారు. ఇంటర్మీడియట్ బోర్డు నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్న బసిష్ట కాలేజీపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భాషిత జూనియర్ కాలేజీ (కోడ్: 59219) యాజమాన్యం ఇంటర్మీడియట్ బోర్డు నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నదని తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు, రెండు రిమైండర్లు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యం, అనుమానాస్పద వ్యవహారం అని ఎన్ ఎస్ యు ఐ ఆరోపించింది.

**ఎన్ ఎస్ యు ఐ బయటపెట్టిన కీలక అక్రమాలు**

ఒకే కోడ్ (59219) కింద మూడు వేర్వేరు క్యాంపస్‌లను అక్రమంగా నిర్వహించడం. అనుమతులు లేని, భద్రతా ప్రమాణాలు లేని భవనంలో కాలేజీ నిర్వహణ, భవనంలోని 5వ అంతస్తును వి పి ఓ ఆర్ ఇన్స్టిట్యూట్‌కు అద్దెకు ఇచ్చి వాణిజ్యంగా వినియోగించడం, ఇది బోర్డు నియమాలకు విరుద్ధం, విద్యా వ్యవస్థను ఆర్థిక లాభాల కోసం దుర్వినియోగం చేయడం అంటే విషయాలను బయటపెట్టారు. అనంతరం ఎన్ఎస్యుఐ నాయకుడు గొల్ల జాన్







మాట్లాడుతూ ఇది సాధారణ తప్పు కాదని, ఇది విద్యా వ్యవస్థను దుర్వినియోగం చేసే ఒక సుస్థిర అక్రమమని, అధికారులు మౌనం పాటించడం పట్ల తీవ్ర అనుమానాస్పదం వ్యక్తం అవుతుందని అన్నారు. భాషిత జూనియర్ కాలేజీకి కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని తక్షణమే రద్దు చేయాలిఅని, కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒకే కోడ్ కింద బహుళ క్యాంపస్‌ల నిర్వహణపై వెంటనే దర్యాప్తు చేపట్టాలని అన్నారు.అక్రమ అద్దె, ఆర్థిక లావాదేవీలపై పూర్తి విచారణ జరపాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. సంబంధిత అధికారులపై ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపడుతుందని, బాధ్యులైన అధికారులను బహిర్గతం చేస్తామని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ఎన్ ఎస్ యు ఐ స్పష్టం చేసింది.

## ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ప్రధాన సమస్యల సాధనకై ఈ నెల 17న జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి టీజీఈ జెఏసి ఖమ్మం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ ఎంప్లాయిస్ గెజిటెడ్ ఆఫీసర్స్ టీచర్స్ వర్కర్స్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో ఉద్యోగుల దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో గౌరవ అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ పి .శ్రీనివాస్ రెడ్డి , జెడ్ ఎస్ జైపాల్, మోదుగు వేలాద్రి, అధ్యక్షతన వినతి పత్రం సమర్పించడం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలోని 15.25 లక్షల ఉద్యోగుల యొక్క 206 సంఘాలకు సంబంధించిన తెలంగాణ ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మికుల మరియు పెన్షనర్స్ యొక్క రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో తీసుకున్న తీర్మాణాల నిర్ణయం మేరకు దశల వారి ఆందోళనలలో భాగంగా 17వ తారీకు మధ్యాహ్నం భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు మండల కార్యాలయాలలో, డివిజన్ కార్యాలయాలలో, జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో సంబంధిత అధికారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన, ఈ క్రింది తెలిపిన దీర్ఘకాలిక పెండింగ్ (4) ప్రధాన సమస్యలను పరిశీలించి, వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడానికి అనుమతి కోరుతూ వినతి పత్రం సమర్పించడం అయినది. ఈ కార్యక్రమంలో టీజీఈ జెఏసి భాగస్వామ్య సంఘాలు అందరూ పెద్ద ఎద్దుల పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడమైనది ఈ కార్యక్రమంలో టి ఆర్ ఈ ఎస్ ఏ జిల్లా అధ్యక్షులు సునీల్ రెడ్డి, టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు షేక్. రంజాన్, టీజీవో కోశాధికారి సూరంపల్లి రాంబాబు, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, టీఎన్జీవో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కొమరగిరి దుర్గాప్రసాద్, కోశాధికారి వల్లపు వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏలూరి కోణార్, యఎస్ జి పి ఏ అధ్యక్షులు పరిష పుల్లయ్య, తెలంగాణ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాధ్యులు వెంకటపతి రాజు, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు రవికుమార్ నాగేశ్వరరావు, ఈ.రామకృష్ణ, , టీఎన్జీవో మాజీ అధ్యక్షులు పూర్వా జేఏసీ చైర్మన్ పొట్టపింజర రామయ్య, నాలుగో తరగతి ఉద్యోగ సంఘ కార్యదర్శి కాంపాటి వెంకటరమణ, పంచాయతీరాజ్ మినిస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేష్ గుప్తా, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.అస్లాం ఖాన్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంగన్న, గుప్త, గోవింద కృష్ణయ్య, అన్వర్, ఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు తెలంగాణ పీసీసీ మెంబర్ మహ్మద్ జావిద్ కు నేలకొండపల్లి సెంటర్ లో నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు...

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** మహ్మద్ జావిద్ పీసీసీ మెంబర్ మాజీ ఖమ్మం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత ఈరోజు మధ్యాహ్నం మోతి గ్రామం దగ్గర రోడ్డు యాక్సిడెంట్ లో మరణించడం పట్ల నేలకొండపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో మరియు నేలకొండపల్లి మండల పట్టణ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లి సెంటర్ లో మాహ్మద్ జావీద్ చిత్రం పట్టణానికీ నివాళులు అర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పాల్గొన్ని, నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామానికి చెందిన జావీద్ రాష్ట్ర నేత ఎదిగాడు అయన అకాల మరణం పట్ల వారి కుటుంబానికి సంతాపం తెలిపారు,ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మామిడి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నెల్లూరు భద్రయ్య, పాలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెర్రిపోతుల సత్యనారాయణ, సో సైట్ డైరెక్టర్ మైసా శంకర్, కుక్కల హన్మంతరావు, సర్పంచ్ బొయన వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుపులేటి ఉపేందర్, వార్డు మెంబర్ తోట వాసు, కొడిరెక్క వినోద్, మైనార్టీ నాయకులు సుబాన్, మైబెల్, ూని మీరా సాహెబ్, షాకిర్, సొందు మీడియా, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కొమ్మూరి నరేష్, కడియాలు నరేష్, చెరుకు రంగయ్య, గుడపాటి ముక్కంటి, కుక్కల ఆదాం, కరణకార్,గొవింద్,దేవపొంగు వెంకన్నా, కొమ్మనబొయన సీత, చిట్టా సైదురెడ్డి , గొళ్ళ శ్రీను, రాయపూడి శ్రీను,కట్టేకొల వెంకన్న, బాల్య మిత్రులు రామగిర రవి, దండా శ్రీను మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని నివాళులు అర్పించారు

# ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలే ప్రభుత్వ లక్ష్యం.... డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

## నూతన విద్యుత్ నియంత్రికల మరమ్మత్తు కేంద్రానికి శంకుస్థాపన

## రూ.7.50 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సి.ఎం. బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి టీజీ ఎన్పిడిసిఎల్ ద్వారా పెనుబల్లి మండలం తుమ్మలపల్లిలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ నియంత్రికల మరమ్మతు కేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, పెనుబల్లిలో రూ.7 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అలాగే విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. గ్రామీణ అభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొంటూ, ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరా విషయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నూతనంగా చేపట్టిన సబ్‌స్టేషన్ల నిర్మాణం, మరమ్మత్తు కేంద్రాల ద్వారా వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు ప్రస్తుత సబ్‌స్టేషన్లపై ఉన్న ఓవర్ లోడ్ తగ్గుతుందని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల ద్వారా వేలాది మంది వినియోగ దారులకు ప్రయోజనం కలగడంతో పాటు విద్యుత్ వోల్టేజ్ నియంత్రణ, పవర్ ఫ్యాక్టర్ మెరుగుదల సాధ్యమవుతుందని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యుత్ రంగంలో చేపడుతున్న సబ్‌స్టేషన్లు, మరమ్మత్తు కేంద్రాల నిర్మాణం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందుతాయని, వేసవిలో కూడా నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగుతుందని తెలిపారు. ఆరోగ్య, విద్య రంగాల బలోపేతంతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతా యని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసిపి, ఎస్ఈ ఎన్పిడిసిఎల్ శ్రీనివాస చారి, డి.ఎం అండ్ హెచ్.ఓ. డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కొక్కిరేణి లో మెరిసిన ఆణిముత్యం

### ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్టేట్ థర్డ్ ర్యాంకు సాధించిన కళ్ళం పరిణి

### విద్యార్థిని సన్మానించిన కొక్కిరేణి గ్రామ సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి గ్రామంలో ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో కొక్కిరేణి గ్రామానికి చెందిన కళ్ళం సాంబశివరావు కళ్యాణి దంపతుల కుమార్తె కళ్ళం పరిణి ఇంటర్మీడియట్ లో తెలంగాణ స్టేట్ లో మూడవ ర్యాంక్ సాధించింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు కళ్లెం పరిణి కి అభినందనలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో కొక్కిరేణి గ్రామ సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్ ఒకటవ వార్డు సభ్యులు గుంతెటి సుజాత వెంకటేశ్వర్లు దొడ్డి చలపతిరావు కల్లం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

### ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి అన్నారు. అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాలలో అరైవ్– అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై విద్యార్థుకుల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. స్కూల్ బస్సులో సురక్షితంగా ఎక్కడం, దిగడం ఎలా, వరుసలో నిలబడాలని, తోపులాటలు మానుకోవాలని, బస్సు పూర్తిగా ఆగే వరకు వేచి ఉండాలని, ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు చేతి పట్టులను (హ్యాండ్‌రైల్స్‌ను) ఉపయోగించాలని, కదులుతున్న బస్సు నుంచి ఎప్పుడూ దిగడానికి ప్రయత్నించవద్దని విద్యార్థులకు సూచించారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు తల్లి దండ్రులకు హెల్మెట్ ధరించాలని చెప్పాలన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు.. ఎరుపు అంటే ఆగడం, ఆకుపచ్చ అంటే వెళ్లడం, పసుపు అంటే వేగాన్ని తగ్గించడం అన్నారు. వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్‌ను ఎప్పుడూ ఉపయోగించవద్దని సూచించారు. మైనర్లు వాహనాలను నడపవద్దన్నారు. మద్యం తాగి వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సై నాగారాజు, గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాల కరస్పాడెంట్ ఎండీ ఎర్షాద్ అహ్మద్, ప్రిన్సిపాల్ శేఖర్ రెడ్డి, దామల్ల పాపారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ స్థాయి చికిత్సే లక్ష్యం : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సత్తుపల్లి నియోజకవర్గం బుధవారం ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదికైంది. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఒకేరోజు మూడు ప్రభుత్వ ఆస్పత్రులను ప్రారంభించారు. రూ. 34 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన 100 పడకల వైద్య విధాన పరిషత్ ఏరియా ఆస్పత్రితో పాటు కల్లూరు (50 పడకలు), పెనుబల్లి (30 పడకలు) ఆస్పత్రులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కలిసి ప్రజలకు అంకితం చేశారు.

**పేదలకు అండగా ఆరోగ్యశ్రీ:** ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని నమ్మి తమ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. "గత పాలకులు కాగితాలకే పరిమితం చేసిన భవనాలను, అసంపూర్తి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశాం ధనికులకు అందే వైద్యం పేదవాడికి కూడా ఉచితంగా అందాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అందుకే బాధ్యతలు చేపట్టిన 48 గంటల్లోనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచాం" అని ఆయన వివరించారు.



# ఘనంగా గాయత్రీ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా :** ఈరోజు ఖమ్మం నగరంలోని గాయత్రి డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఎం.బి గార్డెన్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సైబర్ క్రైమ్ ఎస్సై విజయ్ పాల్గొని ప్రసంగించారు. ఈ రోజుల్లో మొబైల్ చేతుల్లో ఉండడం ద్వారా సులువుగా ధనవంతులు కావాలని ఆశ ఉండటం బెట్టింగ్ యాప్స్ అలాగే లోన్ యాప్స్ అనవసరమైన లింకులు క్లిక్ చేయడం ద్వారా చాలామంది యువత సైబర్ క్రైమ్ లో బాధ్యులవుతున్నారని అత్యధికంగా యువత పై సైబర్ క్రైమ్ కేసులు నమోదు కావడం కొంత దిగ్భ్రాంతిని కలిగిస్తుందని తెలియజేశారు. కళాశాల విద్యార్థులను ఉద్దేశించి సైబర్ క్రైమ్ కి దూరంగా ఉండాలని దానికి కావలసిన అవగాహనను విద్యార్థులకు కల్పించారు. అలాగే విశిష్ట అతిథి కవి సీతారాం మాట్లాడుతూ నేటి యువత మత్తు పానీయాలకు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని వాటి వల్ల జరుగుతున్న అనర్థాల మూలంగా యువత నిర్వీర్యం అవుతుందని అందుకు అవసరమయ్యే చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడు సరికొత్త విధానాలను అవలంబిస్తుందని అయినప్పటికీ యువతలో మార్పు రావట్లేదని స్వీయ నియంత్రణ ద్వారా మాత్రమే కొన్ని నేరాలను అరికట్టవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ కళాశాల ప్రిన్సిపల్ మరియు కరస్పాండెంట్ కుతుంబాక సునీల్ కుమార్ కళాశాల చైర్మన్ వెంకటేశ్వర్లు డైరెక్టర్లు కిలారు కుటుంబరావు, సీతారామయ్య, కళాశాల ఎన్ఎస్–ఎస్ పిఓ జయప్రద మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పస్నూర్ పాఠశాలలో ఘనంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం



**నల్గొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే లక్ష్యంతో, తెలంగాణ పోలీసులు చేపట్టిన, అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా, నాంపల్లి మండలంలోని, పస్నూర్ గ్రామంలో జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో, బుధవారం ఒక ప్రత్యేక అవగాహన సదస్సును పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి సర్కిల్ సీఐ దూది రాజు, నాంపల్లి ఎస్ఐ పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన కల్పించారు.

**చిన్నారులతో వినూత్న కార్యక్రమం**

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు, రోడ్డు భద్రత–ప్రాణ రక్షణ అనే అంశంపై విద్యార్థులతో లేఖలు రాయించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, మితిమీరిన వేగంతో వెళ్లకూడదని తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను కోరుతూ, విద్యార్థులు రాసిన లేఖలు అందరినీ ఆకట్టుకున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు ప్రజలకు సూచించారు. చిన్న వయస్సు నుండే విద్యార్థులకు ఇలాంటి విషయాలపై అవగాహన ఉండాలని వారు పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పై 4వ దశ అరైవ్ అలైవ్ అవగాహన సదస్సు

### రోడ్లపై తగు జాగ్రత్త పాటించి యాక్సిడెంట్ల కాకుండా తమ ప్రాణాలు రక్షించుకోవాలి

### సీఐ తిరుపతిరెడ్డి మండల ఎస్సై కూచిపూడి జగదీష్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై 4వ దశ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని సిఐ తిరుపతి రెడ్డి తో కలసి మండల ఎస్సై కూచిపూడి జగదీశ్ బుధవారం నిర్వహించాను. జెడ్పిహెచ్ఎస్ పిండిప్రోలు స్కూల్లో గ్రామంలో మరియు సరస్వతి విద్యాలయం దమ్మాయిగూడెం గ్రామంలో స్కూల్ బస్సు డ్రైవర్లతో తాగి వాహనం నడపడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, అదేవిధంగా మండల కేంద్రంలోని హైవే రోడ్ లో తిరుమలాయపాలెం నుండి ఖమ్మం వెళ్లే దూర ప్రాంతాల ప్రజలు తగు జాగ్రత్త తీసుకోవాలని హెల్మెట్ లేకుండా ఎట్టి పరిస్థితిలో ఎండాకాలం బయటికి వెళ్ళొద్దని, రోడ్లపై ఘోరంగా ఆక్సిడెంట్లుకు, గురవుతున్నారని సీఐ తిరుపతిరెడ్డి మండల ఎస్సై కూచిపూడి జగదీష్ రోడ్డు భద్రత అవగాహన సదస్సులు, తిరుమలాయపాలెం మండల వ్యాప్తంగా కొనసాగించారు, ప్రజల తమ ప్రాణాలు కాపాడుకొని తమ గమ్యానికి జాగ్రత్తలు పాటించి చేరుకోగలరని పోలీస్ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భద్రతా వారోత్సవాల సందర్భంగా తీర్మాన పత్రం అందజేత

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నకిరేకల్ లో జరిగిన బహిరంగ సభలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నియోజకవర్గం 40 గ్రామాలు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపకుండా కారు నడిపేటప్పుడు సీట్ బెల్టు లేకుండా వాహనాలను నడపరాదని తీర్మానించడం అయినది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సర్పంచులు చిట్యాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం నార్కట్పల్లి సర్పంచ్ జేరిపోతుల భరత్ బొజ్జ సుందర్ కట్టవెంకటరెడ్డి సర్పంచులు అందరు కలిసి తీర్మాన పత్రాలలో అందజేసినారు

# ఇందిరమ్మ గృహాల కోసం నిరుపేదల అర్జీలు -- అధికారులకు వినతి

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండలంలోని జిహెచ్ఎంసి 123వ డివిజన్ పరిధిలోని జన్నారం క్వార్టర్స్‌లో గత పది సంవత్సరాలుగా అద్దె ఇళ్లలో నివసిస్తున్న 11 మంది నిరుపేద కుటుంబాలు ఇందిరమ్మ గృహాల మంజూరు కోసం ప్రభుత్వానికి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లభించిన వెంటనే ఈ నిరుపేదలకు ప్రాధాన్యత క్రమంలో గృహాలు మంజూరు చేయించే దిశగా కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్జీలు సమర్పించిన ప్రజలతో పాటు జిహెచ్ఎంసి 121, 122, 123 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.